అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 11 మార్చి 2023

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జైపూర్

10వ వేజ్ బోర్డులో ప్రవేశపెట్టిన కాంట్రీబ్యూటరీ పోస్ట్ రిటైర్డ్‌మెంట్ మెడికల్ స్కీంలో చేరడం కోసం సింగరేణి యాజమాన్యం దరఖాస్తు గడువును ఈ నెల 31 వరకు పొడిగించింది. సింగరేణి విశ్రాంత ఉద్యోగులు, వివిధ కార్మిక సంఘాల అభ్యర్థన మేరకు అమలులోకి వచ్చిన 2016 జూలై 01 తరువాత రిటైర్డ్ అయిన ఉద్యోగులు వారి వేతనాల నుండి రూ.40 వేలు లేదా కొంత డబ్బు రికవరి చేయించుకో లేనివారు ఉద్యోగ విరమణ పొందిన వారికి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం పేర్కొంది. అర్హులైన విశ్రాంత ఉద్యోగులు వారు పని చేస్తూ పదవీ విరమణ పొందిన గనులు, డిపార్ట్‌మెంట్లలో సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం కోరింది. సింగరేణి యాజమాన్య నిర్ణయాన్ని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ స్వాగతిస్తుందని అసోసియేషన్ ఉపాధ్యక్షులు అళవందార్ వేణుమాధవ్ పేర్కొన్నారు.

ఓసి మహిళా కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణబి ఆదిలాబాద్ అర్బన్



ఓసి సంఘాల ఐక్యత, హక్కుల సాధన, సంఘాలను బలోపేతం చేయడంలో భాగంగా ఓసి మహిళా కార్యవర్గాన్ని నియమించామని ఓసి సంఘాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జనగం సంతోష్, క్యాతం శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఓసీ సంఘాల మహిళా అధ్యక్షురాలిగా అల్లూరి శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా జనగం సృజన, కోశాధికారిగా బానర్కర్ పూజ, ఉపాధ్యక్షురాలిగా గోక వైశాలిని నియమించామన్నారు. వీరు ఏప్రిల్ 9న ప్రమాణ స్వీకారం చేస్తారని పేర్కొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా..?

- స్థలం కలిగిన వారికి ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలు
- గృహలక్ష్మీ పేరిట నియోజకవర్గానికి 3వేల ఇండ్లు
- ఉమ్మడి జిల్లాలో తొలి విడతలో 30వేల మందికి లబ్ధి
- ఏండ్లుగా ఎదురుచూస్తున్న అనేక మంది నిరుపేదలు

నిరుపేదల సొంతింటి కలకు మోక్షం లభించే రోజులు దగ్గరపడ్డాయి. ఇంటి నిర్మాణం కోసం ఏండ్లుగా ఎదురుచూస్తున్న నిరుపేదల ఆశలు ఫలించనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మీ పేరిట సొంత జాగా కలిగిన వారికి రూ.3లక్షలు ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించిన ప్రభుత్వం తాజాగా కేబినెట్ భేటీలోనూ ఈ అంశానికి ప్రాధాన్యతనిచ్చింది. తొలి విడతలో నియోజకవర్గానికి 3వేల మంది లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ లెక్కన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 30వేల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలుగనుంది. ఇప్పటికే ఇండ్లు లేక గుడిసెల్లో నివాసముంటూ కాలం వెళ్లదీస్తున్న నిరుపేదలు అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకే సొంత స్థలం ఉన్న వారికి ఆర్థికసాయం అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఈ సారి తప్పనిసరిగా అందుతుందనే భరోసాతో ఉన్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం సొంత జాగా కలిగిన వారికి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించడంతో నిరుపేదల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఈ విషయం గత రెండేండ్ల నుంచి చెబుతున్నా లబ్ధిదారుల దరికి మాత్రం చేరడం లేదు. కానీ ఇది ఎన్నికల ఏడాది కావడంతో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి ప్రాధాన్యం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా గృహలక్ష్మీ పేరిట పథకం ప్రవేశపెట్టి అమలు చేయాలని నిర్ణయించింది. ఇటీవల రాష్ట్ర బడ్జెట్‌లోనూ ఈ పథకానికి నిధులు కేటాయించిన ప్రభుత్వం ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. తాజాగా రాష్ట్ర కేబినేట్ భేటీలోనూ సొంత స్థలం కలిగిన వారికి రూ.3లక్షలు ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించడంతో అర్హులైన నిరుపేదల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఇప్పటికే జిల్లా కేంద్రాలు, కొన్ని మండల కేంద్రాల్లో డబుల్ బెడ్‌రూంలు నిర్మించినప్పటికీ వాటిని పంపిణీ చేయడం లేదు. ఇండ్లు తక్కువగా ఉండటం.. అర్హుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఇండ్లు దక్కని వారి నుంచి వ్యతిరేకత ఎదురవుతోందనే ఉద్దేశంతో నిర్మించిన ఇండ్లను పంపిణీ చేయడం లేదని తెలుస్తోంది. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే 3381 ఇండ్లను మంజూరుచేయగా కేవలం 478 ఇండ్లను మాత్రమే పూర్తిచేసింది. మిగితావి నిర్మాణ దశలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. చాలా చోట్ల రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన ఇండ్లను అలాగే వదిలేసింది. ఇటీవల అధికారులు కొన్ని చోట్ల పంపిణీ చేసేందుకు లబ్ధిదారుల ఎంపికను ప్రారంభించారు.

ఏండ్లుగా ఎదురుచూపులు..!

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది మంది లబ్ధిదారులు సొంతింటి కోసం ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రెండో విడత కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమం కొనసాగడంతో ఆ సమయంలో ఇంటి నిర్మాణాలకు ఆటంకం ఏర్పడింది. తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ డబుల్ బెడ్‌రూంలు నిర్మించి ఇస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో గత పదేండ్లపైగా అనేక మంది అర్హులు సొంతింటి నిర్మాణం కోసం ప్రభుత్వం సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి కుటుంబాల్లో జీవిస్తున్న అనేక మంది పెండ్లీలు చేసుకొని వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి అనేక మంది ఇంటి పక్కన చిన్న గుడిసెలు వేసుకొని బతుకుతున్నారు. ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అనేక ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఈ వినతిని పట్టించుకోలేదు. ఈ అంశంపై ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ప్రభుత్వం సొంత జాగా కలిగిన వారికి రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేయాలని నిర్ణయించింది. నియోజకవర్గానికి 3వేల చొప్పున ఇంటి నిర్మాణాలకు ఈ సాయం అందించాలని భావిస్తోంది. ఎట్టకేలకు ఆయా నియోజకవర్గాల్లోని నిరుపేదలకు సొంతింటి కల నెరవేరే అవకాశం కనిపిస్తోంది.

ఇంకా మార్గదర్శకాలు రాలేదు : బసవేశ్వర్, గృహనిర్మాణశాఖాధికారి, ఆదిలాబాద్

రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం పేరిట సొంత స్థలం కలిగిన వారికి రూ.3లక్షలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. కానీ ఈ పథకానికి సంబంధించి అధికారికంగా మార్గదర్శకాలు తమకు రాలేదు. రాగానే ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకుంటాం.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- డీఐఈఓ శ్రీధర్ సుమన్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ అన్నారు. శుక్రవారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు, కస్టోడియన్లు, పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష సమయంలో నిర్వాహకులు అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయడానికి పోలీస్, రెవెన్యూ, వైద్యం, పోస్టల్ వారి సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ఉన్న డాక్యుమెంట్లను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. మొబైల్ యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో ఇంటర్ విద్యార్థులు మొత్తం 9933 మందిలో జనరల్ 8457, ఒకేషనల్ విభాగంలో 1476 మంది హాజరు కానున్నారని, అందులో ప్రథమ సంవత్సరం పరీక్షకు 5135 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1478 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిమిత్తం 20 పరీక్షా కేంద్రాలున్నాయని ఇందులో 11 ప్రభుత్వ, 6 ప్రభుత్వ రంగ, 3 ప్రైవేటు కళాశాలలున్నాయని తెలిపారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల్లో డ్యుయల్ డెస్కులు, సీసీ కెమెరాలు, ఇంటర్నెట్, కంప్యూటర్, ప్రింటర్ సదుపాయాలు కేంద్ర నిర్వాహకులు సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు నైతం శంకర్, సీ.హెచ్ తిరుపతి, పరీక్షా నిర్వాహకులు పాల్గొన్నారు.

ట్రైనీ కలెక్టర్ నర్సరీ పరిశీలన



నవతెలంగాణ-బోథ్

మండలంలోని పాట్నాపూర్ గ్రామపంచాయతీ నర్సరీని శుక్రవారం ట్రైనీ కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య లోపం ఉండకుండా చూడాలని సూచించారు. అనంతరం కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించి ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీఓ జీవన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మిథున్, ఏఈఓ శ్యామ్, సర్పంచ్ పంద్రం సుగుణ శంకర్ పాల్గొన్నారు.

కమిషనర్ చేతుల మీదుగా ఎస్ఐకి ప్రశంసాపత్రం



నవతెలంగాణ-జైపూర్

ఎస్సై రామకృష్ణ విధుల నిర్వహణలో భేష్ అనిపించుకున్నారు. 2023 జనవరిలో ఇన్వెస్టిగేషన్, ఎస్‌హెచ్ఓ వర్టికల్ క్యాటగిరి త్రీలో ప్రథమ స్థానంలో నిలిచారు. నెలవారి క్రైమ్ మీటింగ్‌లో భాగంగా శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనర్ రెమో రాజేశ్వరి ఎస్సై రామకృష్ణకు ప్రశంషా పత్రం అందించి అభినందించారు. వర్టికల్, వారెంట్ వర్టికల్‌లో కూడా జైపూర్ పోలీస్‌స్టేషన్ ఉత్తమంగా నిల్చినందున స్టేషన్ రైటర్ సురేష్, భాస్కర్‌గౌడ్‌కు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఎస్సై రామకృష్ణతో పాటు సిబ్బందిని డీసీపీ కేకన్ సుధీర్, జైపూర్ ఏసీపీ నరేందర్, శ్రీరాంపూర్ సీఐ రాజు అభినందించారు.

'కవిత వల్ల తెలంగాణ ఇజ్జత్ పోయింది'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లిక్కర్ స్కాంలో ఆరోపణలు తప్పించుకునేందుకే ఢిల్లీలో దీక్ష పేరుతో ఎమ్మెల్సీ కవిత కొత్త నాటకానికి తెరలేపారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆమె నివాసంలో మీడియాతో మాట్లాడుతూ కవిత వైఖరిని తీవ్రంగా ఖండించారు. లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె ద్వారా తెలంగాణ ఇజ్జత్ పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతున్న కవిత ఎంపీగా ఐదు సంవత్సరాలు పనిచేసినప్పుడు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న తమలాంటి నాయకులను సీఎం కేసీఆర్ తన కూతురు కోసం అణగదొక్కారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌లో మహిళా ప్రజాప్రతినిధులకు సరైన ప్రాధాన్యత కల్పించడం లేదని ఆరోపించారు.

పగటి పూట వద్దు...రాత్రి పూట ముద్దు

- అధికారుల ఆదేశాలు బేఖాతర్
- యధావిధిగా మట్టి తవ్వకాలు

నవతెలంగాణ-జైపూర్

అధికారులు హెచ్చరించినా ప్రయోజనం లేదు. నాయకులు కట్టడి చేయాలని ప్రయత్నించినా ఫలితం లేదు. అక్రమ మార్గంలో మట్టి తరలిపోతూనే ఉంది. రామారావుపేట్ శివారు నుండి అక్రమంగా మట్టి తరలి వెళ్తున్నట్లు నవతెలంగాణలో వచ్చిన వార్తతో అధికారులు స్పందించారు. తవ్వకాలు, తరలింపును నిలిపివేయాలని హెచ్చరించారు. అధికార పార్టీకి చెందిన నాయకుల వాహనాలను అడ్డుకున్నారు. తప్పని పరిస్థితుల్లో వెనక్కు తగ్గిన కాంట్రాక్టర్ రెండు రోజులు గడిచాయో లేదో పగటి పూట కాకుండా మట్టిని రాత్రి పూట అక్రమంగా తరలిస్తున్నారు. ఇందారం ఓపెన్‌కాస్ట్ గని విస్తరణ కోసం రామారావుపేట్ శివారు భూముల్లో ఏర్పాటు చేసిన క్వారీల నుండి పగటి పూట కాకుండా రాత్రి పూట మట్టి తరలిపోతోంది. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వుతున్నట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు తక్షణమే మట్టి తవ్వకం ఆపివేయాలని, యంత్రాలు తరలించాలని ఆదేశించారు. అక్రమ మట్టి తవ్వకాలకు అలవాటుపడిన కాంట్రాక్టర్ అధికారుల ఆదేశాలు బేఖాతరు చేసి మట్టి రవాణా యధావిధిగా కొనసాగిస్తున్నారు.



పట్టా ఉంటే చాలు మైనింగ్ అనుమతులు పొందొచ్చు

పట్టాదార్ పాసుపుస్తకం ఉంటే చాలు తమకున్న పరపతిని ఉపయోగించి మైనింగ్ అనుమతులు పొందవచ్చని తెలుస్తోంది. అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటున్న సర్వే నెంబర్‌లో భూమి ఉందా..? బండ ఉందా...? నీటిలో మునిగి ఉందా...?ఇవేమీ చూడకుండా మైనింగ్ అనుమతి పొందవచ్చని పలువురు పేర్కొంటున్నారు. స్థల పరిశీలన చేయకుండా మైనింగ్ అధికారులు నేరుగా మట్టి తవ్వకానికి అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. రెవెన్యూ అధికారులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుండటం ఈ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది. రెవెన్యూ కార్యాలయం నుండి కాకుండా నేరుగా మైనింగ్ కార్యాలయం నుండి అనుమతులు పొందుతున్నారని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.

మైనింగ్ అనుమతులు పరిశీలించాలి : తహసీల్దార్ మోహన్‌రెడ్డి

రామారావుపేట్ శివారులో ఏర్పాటు చేసిన మట్టి క్వారీల అనుమతులకు సంబంధించిన మైనింగ్ అనుమతులు పరిశీలించాల్సి ఉంది. అనుమతుల్లో పొందుపర్చిన నియమ నిబంధనలు, స్థానికంగా జరుపుతున్న మట్టి తవ్వకాలు, అనుమతి ఎందుకోసం ఇచ్చారు..స్థానికంగా ఎలా వినియోగిస్తున్నారో తరచి చూడాల్సి ఉంది. ప్రస్తుతానికి మట్టి తవ్వకం నిలిపివేయాలని ఆదేశించాం. రాత్రి పూట తవ్వుతున్నట్లు తెలుస్తోంది. మరోమారు స్థల పరిశీలన చేసి తగు విధంగా చర్యలు తీసుకుంటాం.



పెండ్లి కానుకగా రూ.50వేల సామాగ్రి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన 1997 -98 పూర్వ విద్యార్థులు గ్రామానికి చెందిన అగంధం గణేష్ కూతురి పెళ్లికి రూ.50వేలతో ఫ్రిజ్, కూలర్, టీవీ, బీరువాను కానుక రూపంలో అందజేశారు. ఏడవ తరగతి బ్యాచ్‌కు చెందిన ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కానుక రూపంలో సామాగ్రిని అందజేసినందుకు గ్రామస్తులు పూర్వ విద్యార్థులను అభినందించారు.



ఆత్మవిశ్వాసమే అతివకు ఆలంబన

- మహిళా దినోత్సవ వేడుకల్లో సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్



నవతెలంగాణ-బాసర

ఆత్మవిశ్వాసమే అతివలకు ఆలంబనని సీఎం ఓఎస్డి ప్రియాంక వర్గీస్ అన్నారు. శనివారం ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె విద్యార్థినులద్దేశించి మాట్లాడుతూ అతివలు ఎక్కడ తక్కువ కాదని, విజయ తీరాలకు చేరేందుకు ప్రతి ఒక్కరు నిరంతరం తమకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. యూనివర్సిటీలో 70శాతం పైగా విద్యార్థినులు విద్యను అభ్యసించడం తనకు ఆనందాన్నిచ్చిందన్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడుతూ ఇష్టంగా విద్యను అభ్యసించి సమాజానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థినుల సంక్షేమానికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు యూనివర్సిటీలో చిల్డ్రన్స్ కేర్, ఉమెన్ టెక్నాలజీ క్లబ్‌ను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌తో కలిసి సీఎం ఓఎస్‌డి ప్రారంభించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుస్సాడి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థినులను అలరించాయి. కార్యక్రమంలో డైరెక్టర్ సతీష్ కుమార్, బైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఉమెన్ సెల్ కన్వీనర్ పావని, శోభ, సృజన, సారిక పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో పూజలు

సరస్వతీదేవిని సీఎం ఓఎస్డి ప్రియాంక వర్గీస్ దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారి చెంత ఆలయ అర్చకులు ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరిపించి హారతినిచ్చి ఆశీర్వదించారు. ఆలయ అధికారులు పట్టుచీర, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలి

- కలెక్టర్‌కు టీపీసీసీ కార్యదర్శి సుజాత వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత అన్నారు. శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి విన్నవించారు. జైనథ్ మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తయి దాదాపు నాలుగు సంవత్సరాలు గడిచిందన్నారు. గతంలో గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులకు గుర్తించడం జరిగిందన్నారు. కానీ వారికి పట్టాలు ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. మళ్లీ ఇప్పుడు గ్రామసభ నిర్వహించి ప్రజల నుండి వినతి పత్రాలు సేకరించడం జరిగిందన్నారు. కానీ లబ్ధిదారులకు గుర్తింపులో అర్హులను కాకుండా ఇల్లు ఉన్నవారికి, ప్రభుత్వం ద్వారా ఇతర లబ్ధి పొందిన వారికి అర్హులుగా గుర్తించారని తెలిపారు. అలా కాకుండా సమగ్ర సర్వే నివేదిక ఆధారంగా మళ్లీ గ్రామసభ నిర్వహించి అర్హులైన పేదలను గుర్తించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఇల్లు లేని వారిని గుర్తించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ రూపేష్‌రెడ్డి, రాజేశ్వర్, రాంకిష్టు, బొక్రే శంకర్ ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలోని పలు వార్డులు, ఆసుపత్రి పరిసరాలను, వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, రోగులతో స్నేహభావంతో మెలగాలని అన్నారు. ఆసుపత్రిలో ప్రతి వార్డు ఉపయోగంలో ఉంచాలని, రోగులు వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డైయిస్, రేడియాలజీ భవనాలలో సేవలను అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవం చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, గర్భం దాల్చిన తరువాత సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తమ వివరాలు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రసవం అనంతరం అందించే కేసీఆర్ కిట్లను గదులలో భద్రపరిచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వామి, వైద్యులు, సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్

శనివారం 11 మార్చి 2023

చలివేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్

నవతెలంగాణ-కడెం



మండల కేంద్రంలో కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన దినేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ చిన్నయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సదర్ మాట్ కాలువ సాధన సమితి రైతు అధ్యక్షులు హపావత్ రాజేందర్, ప్రధానోపాధ్యాయులు స్వప్న, ఉపసర్పంచ్ అజాం, సర్వేయర్ ఉమాజీ, మాజీ సర్పంచ్ సకీనాల ప్రవీణ్, గంగన్న, గ్రామస్తులు పాలకుర్తి కృష్ణ, కోయిల్‌కార్ సతీష్, సుమంత్, గంగాధర్, ఎం.రాజేష్, మల్లేష్, నాగేష్, రాజు, ఫైసల్, నర్సయ్య పాల్గొన్నారు.

ఆవుకు అంత్యక్రియలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆవుకు అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు, గోమాత ఫౌండేషన్ సభ్యులు. మండలంలో శుక్రవారం 170 కాలనీలో ఆవు మృత్యువాత పడటంతో కాలనీవాసి వంశీ గోమాత సేవా ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫౌండేషన్ సభ్యులు, కాలనీవాసులు కలిసి జేసీబీ సాయంతో ఆవుకు అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమంలో గోమాత ఫౌండేషన్ సభ్యులు సురేష్, సాయికృష్ణ, హేమాన్న, రాజశేఖర్, రాజారెడ్డి, వంశీ, కార్తిక్ పాల్గొన్నారు.

అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి



నవతెలంగాణ-ఖానాపూర్

నిజమైన పేదలను గుర్తించి, అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ లు, వెంటనే పంపిణీ చేయాలని గిరిజన శక్తి రాష్ట్ర కార్యదర్శి బాణావత్ సిద్ధార్థ నాయక్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణంలో మొన్న జరిగినటువంటి డబుల్ బెడ్ రూమ్ లక్కీడ్రాలో అవకతవకలు జరిగాయని అన్నారు. అనర్హులకు ఇండ్లు దక్కాయని, లబ్ధిదారులకు ఎవరికి ఇండ్లు రాలేవని ఇప్పటికైనా అధికారులు సమగ్ర విచారణ జరిపి అర్హులకు అందేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో కుర్మ సంఘ ఖానాపూర్ నాయకుడు ఎగుర్ల మహేష్, కరిపే రాజశేఖర్, ఖదీర్, రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

12న జిల్లా స్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

12న జిల్లాస్థాయి ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్ పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉంటాయని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి పి.రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ హైదరాబాద్‌లోని ఆర్టిలరీ సెంటర్ గోల్కొండలో అథ్లెటిక్స్ స్టేడియంలో జరగబోయే ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథెటిక్స్ చాంపియన్షిప్, తెలంగాణ స్టేట్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ కొరకు ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేయటం జరుగుతుందని అన్నారు. 16 సంవత్సరాల పైబడిన వారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9492136510 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

భగీరథ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే సమ్మె తప్పదు



నవతెలంగాణ-నార్నూర్

మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులకు ఐదు నెలల వేతనాలు ఇవ్వకపోవడంతో, సమస్యలు ఎదుర్కొంటున్నారని, సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని భగీరథ కార్మికులు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో డీప్యూటీ తహసీల్దార్ అమృత్ లాల్‌కు వినతిపత్రం అందజేశారు. వేతనాలు అందించేందుకు జీఓ 11 లేదా 60ని అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను వెంటనే అందించాలని అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కార్మికులు రోహిదాస్, ప్రకాష్, మధుకర్, దన్‌రాజ్, శుభం, సంతోష్, సునీల్, రాహుల్, కార్తిక్, బాలాజీ, మిలింద్, పరమేశ్వర్, వికాస్ ఉన్నారు.

కుల సంఘాల నూతన సభ్యులకు సన్మానం



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

ఇటీవల వివిధ కుల సంఘాల నూతన సభ్యులుగా బాధ్యతలు చేపట్టిన వారిని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి సన్మానించారు. శుక్రవారం ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి కాసర్ల శ్రీనివాస్, జిల్లా యువజన విభాగం కన్వీనర్ తొకల నరేష్, కో కన్వీనర్ విద్యాసాగర్, నకాష్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నవీన్ వర్మ, ఓసీ సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి అశ్విన్‌లకు సుహాసినిరెడ్డి శాలువా కప్పి సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గటిక క్రాంతి కుమార్, గన్నోజి విజయ్ కుమార్, కాంత, ప్రశాంత్, నాగేందర్‌గౌడ్ ఉన్నారు.

వీఓఏలకు యూనిఫామ్స్ పంపిణీ



నవతెలంగాణ-కడెం

ప్రియదర్శిని మండల సమైక్య ఆధ్వర్యంలో శుక్రవారం డీపీఎం ఐబీ జ్ఞాను చేతుల మీదుగా వీఓఏలకు యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజారామ్, సీసీలు మల్యాల స్వామి, నర్సయ్య, జ్యోతి, పద్మజా అకౌంటెంట్ లింగన్న, వీఓఏల అధ్యక్షుడు విక్రమ్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, గొప్ప సంఘసంస్కర్తగా స్త్రీ జాతికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు మరువలేనివని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కూలే అన్నారు. శుక్రవారం జ్ఞాన జ్యోతి సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని పురస్కరించుకొని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆవరణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో చదువురాని సావిత్రిబాయి పూలే చదువు నేర్చుకుని 1848వ సంవత్సరంలో భారతదేశ తొలి బాలికల పాఠశాలను మహారాష్ట్రలోని పూణే నగరంలో ఏర్పాటు చేసి స్త్రీ విద్యకు నాంది పలికారని తెలిపారు. ఆమె స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వారి హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారని అన్నారు. పూలే దంపతుల ఆశయాల సాధనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని పూలే చౌక్‌లో పూలే దంపతుల విగ్రహాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు నర్సాగౌడ్, అధ్యక్షులు చిక్కాల దత్తు, ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, బీసీ సంఘ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, మాలీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డగూరే విజయ్, డి. ఉత్తమ్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌అర్బన్‌లో...

ఉట్నూర్ : జ్ఞాన జ్యోతి సావిత్రిబాయి భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చేసిన సేవలు ఆదర్శనీయమని హస్నాపూర్ ఉపసర్పంచ్ అశోక్ అన్నారు. సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని పురస్కరించుకొని హస్నాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భర్త మహాత్మ జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో చదువు నేర్చుకుని 1848వ సంవత్సరంలో దేశంలో తొలి బాలికల పాఠశాలను మహారాష్ట్రలోని పూణే నగరంలో ఏర్పాటు చేసి స్త్రీ విద్యకు నాంది పలికిన గొప్ప వ్యక్తని కొనియాడారు. ఆమె స్ఫూర్తిగా తీసుకొని నేటి మహిళ సమాజం అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు షేక్ జావేద్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి పృథ్వీరాజ్, నాయకులు విష్ణు, గోవింద్, వినోద్ పాల్గొన్నారు.

నార్నూర్ : మండలంలోని ఖంపూర్ గ్రామంలో దళిత హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం భారతీయ సంఘ సంస్కర్త ఉపాధ్యాయిని రచయిత్రి, సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి, పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు విద్య, ఉద్యోగం, సామాజిక, రాజకీయాలలో ముందుకు సాగాలని అన్నారు. మహాపురుషులను ఆదర్శంగా తీసుకొని సావిత్రిబాయి పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి రమాబాయి, లాంటి అనేకమంది మహా వీరనారులు సమ సమాజం కోసం మహిళల హక్కుల సాధన కోసం పోరాడిన వారందరి స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలని వారి ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లినప్పుడే మహిళా దినోత్సవానికి నిజమైన సార్థకత ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సలాం ఆనందరావు, ఎంపీటీసీ ఏత్మ బాయి, సీహెచ్ శ్రీనివాస్, గ్రామ పటేల్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో...



నార్నూర్‌లో...

17న అగ్రజా టౌన్‌షిప్‌లోని రాజీవ్ స్వగృహా ప్లాట్ల వేలం పాట

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



17న అగ్రజా టౌన్‌షిప్‌లోని రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలం పాట నిర్వహిస్తున్నా మని, ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో ప్రీ బిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావల మండలంలోని బట్టి సావర్గాంలోని రాజీవ్ స్వగృహ లేఅవుట్‌లోని 362 ప్లాట్లను గత సంవత్సరం నవంబర్ మాసంలో బహిరంగ వేలం వేయడం జరిగిందని, వాటిలో 58 ప్లాట్లకు బిడ్డర్లు డబ్బులు చెల్లించని కారణంగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు మళ్లీ బహిరంగ వేలం ఈ నెల 17న నిర్వహించనున్నామని తెలిపారు. అట్టి వేలం పాటలో పాల్గొనదలచిన వారు పది వేల రూపాయల విలువ గల డిమాండ్ డ్రాఫ్ట్‌ను జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్ పేరున తీసుకొని దరఖాస్తు అందజేయాలని తెలిపారు. లేఅవుట్‌లో ఇప్పటికే మౌలిక సదుపాయాల కల్పనకు పనులు ప్రారంభించామని అన్నారు. నీటివసతి, విద్యుత్ పోల్స్, మురికి కాల్వలు, తదితర పనులకు రూ.7 కోట్లతో ప్రతి పాదనలు పంపించామని అన్నారు. త్వరలో మంజూరు ఉత్తర్వులు రానున్నాయని తెలిపారు. అలాగే లేఅవుట్ గుండా సర్వీస్ రోడ్డు కొరకు జాతీయ రహదారుల అధికారులకు ప్రతిపాదనలు పంపించామని అన్నారు. అట్టి పనులు ప్రారంభించడానికి సుముఖంగా ఉన్నారని తెలిపారు. ఈ లేఅవుట్ ప్రక్కనే ఐటీ టవర్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ మహేశ్వర్ మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొనే ఆసక్తి గల వారు రూ.10 వేల విలువ గల డిమాండ్ డ్రాఫ్ట్‌ను దరఖాస్తుకు జతచేసి, మార్చి 17న జరిగే బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. గజానికి ఎనిమిది వేల రూపాయలతో మినిమం వేలం పాటగా నిర్ణయించడం జరిగిందని, వేలం పాటలో ఎవరైతే ఎక్కువ బిడ్డింగ్ చేస్తారో వారికి ఆ ప్లాట్ పొందవచ్చని తెలిపారు. అంతకుముందు ఆర్డీఓ రమేష్ రాథోడ్ మాట్లాడుతూ ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొని, ఇంటి స్థలాన్ని స్వంతం చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ నోడల్ అధికారి బసవేశ్వర్, టీఎస్ఐఐసీ జూనియర్ ఇంజనీర్ రాజ్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి సాయి కిరణ్ పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

- అందని మిషన్ భగీరథ తాగునీరు
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్యసమావేశం శుక్రవారం ఎంపీపీ పోటే శోభాబాయి అధ్యక్షతన వాడివేడిగా కొనసాగింది. ముందుగా విద్యావైద్య, ఐకేపీ, అటవీశాఖ అధికారులు తమతమ అభివృద్ధి నివేదికను చదివి వినిపించగా, అటవీశాఖ, మిషన్ భగీరథ అధికారులపై సభ్యులు మండి పడ్డారు. అటవీశాఖలోని బీట్ అధికారిని జ్యోత్స్న పట్టాలు చేయిస్తామని, ఆదివాసులనుంచి వసూళ్లకు పాల్పడుతోందని, కొత్తగా ఇండ్లు నిర్మించున్నా యజమానుల నుంచి డబ్బులు వసూలుకు పాల్పడుతోందని ఎంపీటీసీ సభ్యులు భీమ్‌రావ్ ఎఫ్ఆర్వో శీలానంద్ దృష్టికి తీసుకువచ్చారు. సదరు అధికారినిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమెపై రాత పూర్వకంగా ఫిర్యాదు అందిస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని సమాధానం ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. పంచాయతీలో జరిగే సీసీ తదితర అభివృద్ధికి కోసం తీసుకువచ్చే, ఇసుక ట్రాక్టర్‌లపై అనుమతి ఇవ్వాలని అన్నారు. ఆ ట్రాక్టర్‌లను అటవీశాఖ అధికారులు పట్టుకోకూడదని విన్నవించారు. వేసవికాలం వచ్చిన మండలంలోని మారుమూల గ్రామాలైన మామిడిగూడ(జి), సాలాయిగూడ, దొడంద, గట్టేపల్లి, గౌరాపూర్, హార్యాపూర్, తదితర గ్రామాలకు చుక్క నీరు అందడం లేదని ఎంపీటీసీ సభ్యులు కోవ రాజేశ్వర్, సర్పంచులు లాఖన్, కుడే కైలాస్‌లు, ఎంపీటీసీ గిత్తె ఆశలు అధికారులను నిలదీశారు. ఆ శాఖ గ్రిడ్ అధికారి రాజశేఖర్, ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో ఎత్తుగా ఉండటం, అక్కడక్కడ లీకేజీలు ఉండటంతో నీళ్లు అందడం లేదని సమాధానం ఇవ్వడంతో సభ్యులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీనివ్వడంతో సభ్యులు శాంతించారు. అనంతరం ఐసీడీఎస్, సివిల్ సప్లై శాఖపై సంభందిత శాఖల, అధికారులు నివేదికను వివరించారు. ఈ సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ పుష్పలత, ఇన్‌చార్జీ ఎంపీడీఓ వేణు, తహసీల్దార్ కే.గంగాధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్

కడుపు నొప్పి భరించలేక ఇంట్లోని దులానికి చూన్నీతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం తెల్లవారు జామున మండలంలోని నిగ్వా గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన గాడెకర్ ప్రియాంక(22) యువతి శుక్రవారం తెల్లవారు జామున ఇంట్లోని దులానికి చూన్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ప్రియాంక గత 4నెలల నుంచి విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతుండగా నొప్పి తీవ్రత అధికం కావడంతో మనస్తాపానికి గురైంది. కుటుంబ సభ్యులు అందరూ నిద్రపోతుండగా దులానికి ఉరేసుకుంది. మృతురాలి తల్లి సాగరబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉట్నూర్ బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలను కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు జమీర్ ఖాన్, ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్, సంయుక్త కార్యదర్శి జైవంత్‌రావు, కోశాధికారిగా చింతల గిరి, లైబ్రరీ సెక్రటరీ కొమ్ము విజయ్, స్పోర్ట్స్ సెక్రటరీగా చిమ్నా నాయక్, సలహాదారులుగా గుప్తా, బాపురెడ్డి, ధీరజ్, కార్యవర్గ సభ్యులుగా బావురావు, వసంత్ రావు, శ్రీనివాస్, అశోక్, రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల సాధనకు తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు అందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధ్యక్షుడిని శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

నేషనల్ యూత్ వాలంటీర్స్‌కు దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేషనల్ యూత్ వాలంటీర్స్ ఎంపిక కోసం ఈ నెల 24 వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్లు నెహ్రూ యువ కేంద్రం, ఆదిలాబాద్ జిల్లా యువజన అధికారి సుశీల్ బడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువజన సంఘాల స్థాపన, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, క్రీడలు, ఆరోగ్యం, సామాజిక అంశాలపై యువతకు చైతన్య పర్చి పలు కార్యక్రమాలపై 18 నుండి 29 ఏండ్ల మధ్య వయస్సు కలిగి ఆసక్తిగల యువతీ, యువకులు నేషనల్ యూత్ వాలంటీర్లుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వైకే.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9404736673, 9381731381 నెంబర్లకు సంప్రదించాలని అన్నారు.

ఘనంగా రవన్న వర్ధంతి

- రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)జీవితం ఆదర్శం



నవతెలంగాణ-ఖానాపూర్

రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) ఏడో వర్ధంతిని శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని విశ్రాంతిభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. జిల్లా నాయకులు కే.సర్దార్‌లు మాట్లాడుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీలో కేంద్ర కమిటీ సభ్యులుగా, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఉంటూ, మార్క్సిజం-లెనినిజం మావో ఆలోచన విధానం వెలుగులో, దీర్ఘకాలిక సాయుధ ప్రజా యుద్ధ పంథాలో, 45 సంవత్సరాలుగా అలుపెరగని అజ్ఞాత జీవితం గడిపిన గొప్ప ఆదర్శ కమ్యూనిస్టు విప్లవ కారుడు అని కొనియాడారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపి నర్సయ్య, బుక్యా విలాస్, మంచి కంటి లక్ష్మణ్, గుట్ల ప్రసాద్, గంగన్న ఉన్నారు.

రిమ్స్‌లో అత్యవసర సమయంలో యువకుడి రక్తదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అత్యవసర సమయంలో రక్తదానం చేసి ఓ యువకుడు ఉదారతను చాటుకున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోకారి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి శుక్రవారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని రిమ్స్‌కి తరలించారు. సదరు వ్యక్తికి చికిత్స చేస్తుండగా రక్తం అవసరమని వైద్యులు సూచించారు. దీంతో అక్కడ ఉన్న సుభాష్ నగర్ కాలనీకి చెందిన గాజరి వెంకటేష్ వెంటనే స్పందించి రక్తదానం చేస్తానంటూ ముందుకు వచ్చాడు. రిమ్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేసి ఉదారత చాటుకున్నాడు. దీంతో బాధిత కుటుంబీకులు వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అతని వెంట గాజరి శ్రీనివాస్, గాజరి రజినీకాంత్, గాజరి శ్రీకాంత్ పుస్పుర్ శరత్ ఉన్నారు.

12న సీఓఈలో ప్రవేశానికి ఎంట్రెన్స్ టెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గిరిజన గురుకులాల కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఈనెల 12న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస స్వామి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో ఉదయం 9గంటలకు నిర్వహించే సీఓఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు. హాల్ టికెట్, ప్యాడ్, బ్లాక్, బ్లూపెన్ వెంట తీసుకురావాలని, పూర్తి వివరాలకు 9849390495 నెంబర్‌ని సంప్రదించాలని సూచించారు.

పొన్కల్ ఊర చెరువుకు హద్దులు ఏర్పాటు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ గ్రామంలోని ఊర చెరువుకు శుక్రవారం డిఐఓ గంగాధర్ ఆధ్వర్యంలో హద్దులు ఏర్పాటు చేశారు. ఊర చెరువు కబ్జా అవుతుందని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆందోళన కార్యక్రమాలు చేస్తున్న సందర్భంలో రెవెన్యూ అధికారులు స్పందించారు. సర్వే నెంబర్ 400లో ఉన్న ఊర చెరువుకు హద్దులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఐఓ గంగాధర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఉన్న ఊర చెరువులను పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూస్తామన్నారు. ప్రభుత్వ చెరువులు, భూములను కబ్జా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ భానుచందర్, సర్వేయర్ సురేష్, లైసెన్స్ సర్వేయర్ దాముఖ సుధాకర్ పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన

నవతెలంగాణ-కెరమెరి

రక్తహీనత నివారణపై శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ ఆడ.వెంకటేష్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాయని పేర్కొన్నారు. మహిళలు రక్తహీనత సమస్య బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం అందజేసి వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రక్తహీనతతో బాధపడే మహిళలను క్షేత్ర స్థాయిలో గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్ సూపర్‌వైజర్ లక్ష్మి కాంతం, ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ మండల కోర్డినేటర్ కాల్లె ప్రవీణ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి మెరిట్ స్కాలర్‌షిప్‌కు సాయిచరణ్ ఎంపిక

నవతెలంగాణ-కాసిపేట

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ తెలంగాణ మోడల్ స్కూల్ కాసిపేట విద్యార్థి ఎంపిక అయినట్లు కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య పేర్కొన్నారు. పాఠశాల నుండి 8వ తరగతి చదువుతున్న దాసరి సాయిచరణ్ విద్యార్థి జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థికి సంవత్సరానికి రూ.12వేల చొప్పున ఇంటర్మీడియట్ వరకు స్కాలర్‌షిప్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మెన్ కూకట్ల రాజేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.జలగం అనిత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో కామర్స్ పోస్ట్ ఒకటి ఖాళీ ఉందని తెలిపారు. సంబంధిత సబ్జెక్టు పీజీలో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ వారికి 50శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. పీహెచ్డీ, నెట్, సెట్ ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. బోధన అనుభవం ఉన్నవారికి అదనపు అర్హతగా పరిగణించబడుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మార్చ్ 13వ తేదీన కళాశాలలో ధృవీకరణ పత్రాలు అందజేయాలని, మార్చ్ 15వ తేదీన కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలియజేశారు.

మెడికల్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-గుడిహత్నూర్

మండలకేంద్రంలోని మెడికల్ షాపుల్లో శుక్రవారం ఔషధ నియంత్రణ విభాగం అధికారులు తనిఖీ చేశారు. గత మూడు రోజుల క్రితం మండల శివారులో దొరికిన గర్భ విచ్ఛిత్తి (అబార్షన్)గోలీల విషయమై నవతెలంగాణలో వచ్చిన కథనానికి స్పందించి, వారు విచారణ చేపట్టారు. గుడిహత్నూర్‌లో పడవేసిన గర్భవిచ్ఛిత్తి (అబార్షన్) గోలీల బ్యాచ్ నెంబర్‌కు సంబంధించిన మందులు తనిఖీల్లో దొరకలేదని ఔషధ నియంత్రణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ నర్సయ్య తెలిపారు. గర్భవిచ్ఛిత్తి గోలీలతో పాటు మత్తు కలిగించే మందులను విక్రయించరాదని మెడికల్ షాపు యజమానులకు సూచించారు. ఈ తనిఖీల్లో అదిలాబాద్ డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఆడే శ్రీలత, నిజామాబాద్ డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఆర్.శ్రీలత, జగిత్యాల డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఉపేందర్ పాల్గొన్నారు.

ఉరేసుకొని ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నీట్ పరీక్షలలో క్వాలిఫై అవుతానో లేదోనని ఒత్తిడికి లోనై ఇంటర్ విద్యార్థిని వైష్ణవి(17) ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి పట్టణ పరిధిలోని తిమ్మాపూర్ ఆర్ఆర్ నగర్ రోడ్ నెం2లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైష్ణవి మందమర్రి సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో సెకండియర్ చదువుతున్నది. ఇంటి వద్ద నుండే ఆన్‌లైన్ తరగతులు వింటూ చదువుతున్నది.ఇంటి వద్దనే చదువుతు నీట్‌కు సన్నద్ధం అవుతుంది. గత కొద్ది రోజుల నుండి నీట్‌లో క్వాలిఫై అవుతానో, లేదోనని బాధపడుతూ ఉండేదని తల్లిదండ్రులు పేర్కొన్నారు. గురువారం రాత్రి అన్నం తిన్న తర్వాత చదువుకుంటానని చెప్పి గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. అది గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు తెలిపారు. మృతురాలికి తండ్రి గూడపు కామేశ్వరరావు, అమ్మ సునీత, అన్నయ్య పనింద్ర ఉన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- అదనపు జ్యుడీషియల్ జడ్జి షరీనా

నవతెలంగాణ-ఆసిఫాబాద్



చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మొదటి శ్రేణి అదనపు జ్యుడీషియల్ జడ్జ్ షరీనా అన్నారు. జిల్లా కేంద్రంలోని అంగన్వాడీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో కోర్టు సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీలు కోర్టు సేవలు గురించి అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా కోర్టులో తమ తరపున లాయర్‌లను పెట్టుకోలేని పరిస్థితిలో ఉంటే వారికి ఉచిత న్యాయ సహకారం లభిస్తుందని, దీన్ని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరహరి, డిడబ్ల్యూవో సావిత్రి, న్యాయవాదులు కిషోర్, విద్యాసాగర్, సఖి సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు ఎక్కిన డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు

నవతెలంగాణ-జైనథ్



డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం లబ్దిదారులు రోడ్డెక్కరు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యలో మండల కేంద్రంలో జాతీయ రహదారిపై లబ్దిదారులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత మాట్లాడుతూ మండల కేంద్రంలో 130 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి, లబ్దిదారులను ఎంపిక చేశారు. కొందరు అనర్హులకు ఇండ్లను ఇచ్చారని, అర్హులైనవారికి ఇండ్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ఇండ్లు లేని పేదలను గుర్తించి, అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ పాల్గొని ధర్నాకు సంఘీబావం తెలిపారు. లబ్దిదారులు రోడ్డుపై బైటాయించడంతో రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ ధర్నాలో లబ్దిదారులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు నివారించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



నవతెలంగాణ - జైనూర్

ఆస్పత్రికి వచ్చే మాతా శిశువులపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శుక్రవారం సిర్పూర్(యు) మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని తెలిపారు. ప్రజలకు సేవలందించడంలో వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతల వివరాలను వెంటనే ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. మాతా శిశు మరణాలను నియంత్రించే దిశగా గర్భిణీలకు సమయానుసారంగా అవసరమున్న వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, పౌష్టికాహారం అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఫీల్డులో పనిచేసే సిబ్బంది కూడా బాలింతలకు, గర్భిణులకు ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది స్థానికంగా ఉంటూ ఎల్లవేళల అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధుల పట్ల సమయపాలన పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవికాలం సమీపిస్తున్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని వైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో సిర్పూర్(యు) మండల వైద్యాధికారి రాజు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే నేటి తరానికి ఆదర్శం

- బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్



తాంసిలో..

నవతెలంగాణ-ఆసిఫాబాద్

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే నేటి తరానికి ఆదర్శమని, నేటి యువత ఆమె ఆశయాలను కొనసాగించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్ అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. మహనీయుల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి విద్యావేత్త ఉపాధ్యాయుడు ఉప్పరి సత్యనారాయణ, విద్యారంగ సమస్యల అధ్యయన యాత్ర కన్వీనర్ గడ్డల ప్రణయ్, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సిరికొండ సాయి కృష్ణ, యువ నాయకులు గడ్డల కరణ్, పసుపునూరి సాయిచరణ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెబ్బెన: సావిత్రీబాయి పోరాట ఫలితమే మహిళలకు విద్య అందిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం రవీందర్, మండల కార్యదర్శి బాలునాయక్ అన్నారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా మండలంలోని గోలేటిలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో అవమానాలు ఎదుర్కొని మహిళలకు విద్యనందించేందుకు అనేక పోరాటాలు చేశారని అన్నారు. పూలే పోరాట ఫలితంగా నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. ఆమె పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందని ఆరోపించారు. పాలక ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. మహిళలకు రక్షణగా పకడ్బందీగా చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషు, ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్, రాహుల్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలకేంద్రంలో శుక్రవారం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే వర్ధంతి వేడుకలను మాలీ మహా సంఘం అధ్యక్షుడు ఆదే అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలోని మహాత్మా జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామకృష్ణ, నాయకులు నికాడి మోహన్, భీంరావు, గోపాల్, సురేష్, మహేందర్ పాల్గొన్నారు.

తాంసి : సావిత్రిబాయి పూలే వర్ధంతిని శుక్రవారం మండల కేంద్రంతో పాటు కప్పర్ల గిరిగాం గ్రామాల్లో మాలీ మహా సంఘం సభ్యులతో పాటు బీసీ కులస్తులు యువజన సంఘం సభ్యులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాలీ యువజన సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ మొట్టమొదటి మహిళ పాఠశాలను ఏర్పాటు చేసి వెనుక బడిన మహిళలకు చదువు నేర్పడం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. వారి ఆలోచనలు విధానంలోనే మహిళలు చదువుకొని అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, బీసీ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాలీ సంఘం సభ్యులు ఉమేష్, గంగారాం, రవి, దీపక్, అశోక్ ఉన్నారు.



రెబ్బెనలో..

అవసరాల మేర నీటిని వాడుకోవాలి

- డీఎల్పీఓ ప్రభాకర్ రావు



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతి పరిధిలో వార్డుల వారిగా ఏర్పాటు చేసిన బోరు బావుల నుండి అవసరాల మేర నీటిని వాడుకోవాలని మండల ప్రత్యేక అధికారి, డీఎల్పీఓ ప్రభాకర్‌రావు సూచించారు. శుక్రవారం శివ్వారం గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీఓ అనిల్ కుమార్‌తో కలిసి వార్డుల్లో చేపడుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. గ్రామ పంచాయతీలో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని అన్నారు. పగటిపూట వీధి లైట్లు వెలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా వేసవి ఎండలు పెరుగుతున్నందున అవసరమైనప్పుడు మాత్రమే బోర్లు వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆవిడపు గణేష్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

క్రీడలతో ఆరోగ్యానికి ఎంతో మేలు

- మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్



నవతెలంగాణ - జైనూర్

పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలనే ఉద్దేశంతో పాఠశాలలో క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్నట్టు మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబూతాలిబ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్ షేక్ మౌలా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాలతో కలిసి మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా వచ్చిన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతస్థాయి విద్యనందించేందుకు ప్రభుత్వం అన్ని రంగాల్లో విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. మన ఊరు మన బడి కింద ఎంపికైన పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థిని, విద్యార్థులకు అన్ని మౌళిక సౌకర్యాలు కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మాట్లాడుతూ పాఠశాలలో వచ్చే సంవత్సరం 9వ తరగతి ఉన్నతీకరణ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కోరారు. అనంతరం స్థానిక మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో మండల విద్యాధికారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హసన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కనక గంగారాం, మైనార్టీ నాయకులు షేక్ హైదర్, షేక్ మజర్, నాజీం ఉన్నారు.

ఐకేపీ వీఓఏల సమ్మె నోటీస్ అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, ఈనెల16, 17, 18 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన సమ్మెకు సంబంధించిన నోటీసును జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలని అన్నారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వ్యక్తిగత ఖాతాలకు వేతనాలు చెల్లించాలని అన్నారు. వీటితో పాటు అన్ని డిమాండ్లు పరిష్కరించాలని చేస్తున్న రాష్ట్రవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, జిల్లా కోశాధికారి సునీత, రమ, ఆనంద్, బుద్దు, శ్రీనివాస్, సంతోష్, విజయ్ కుమార్, ధనరాజ్ పాల్గొన్నారు.



రికార్డుల నుండి భూమి తొలగించాలని వినతి

నవతెలంగాణ-జైపూర్

ఇందారం శివారు సర్వే నెంబర్ 154, 155లో 20 గుంటల భూమి తమ పేరు మీదుగా ధరణీ రికార్డుల్లో చూపిస్తోందని, తమదికాని ఈ భూమి తమకొద్దని అసలైన పట్టాదారులకు బదిలీ చేయాలని ఇందారం గ్రామానికి చెందిన రేగుంట లచ్చయ్య కుమారుడు రాకేష్ కోరారు. ఈ విషయమై శుక్రవారం తహసీల్దార్ మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశాడు. రామారావుపేట్ గ్రామ పంచాయతీ దుబ్బగూడెంకు చెందిన రేగుంట లచ్చయ్య అసలైన పట్టాదారుడని తెలిపారు. తండ్రి పేరు తప్ప ఇంటి పేరు పట్టాదారు పేరు ఒకటే కావడంతో ధరణీ రికార్డుల్లో తండ్రిని పట్టాదారుడుగా గుర్తించారని తెలిపారు. పొరపాటున రికార్డు చేసిన ఈ భూమిలో 2గుంటలు వారి కోరిక మేరకు తామే స్వయంగా పట్టా చేసి ఇచ్చామని, మిగతా భూమి కూడా వారి కోరిన విధంగా పట్టా మార్పిడి చేయడంలో ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మందమర్రి ఏరియా టిబిజికెఎస్ ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్ జన్మదిన వేడుకలను శుక్రవారం పట్టణంలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌లో యువ నాయకులు దుబ్బేటి సంతోష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, శాలువాతో సత్కరించి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో టిబిజికెయస్ ఫిట్ సెక్రెటరీ అన్నం రవీందర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజినల్ సెక్రటరీ ఓ.రాజశేఖర్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అజీజ్, పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, జిఎం కమిటీ మెంబర్ శంకర్‌రావు, కుడాల తిరుపతి, లక్ష్మణ్, రామకృష్ణ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రామిడి కుమార్, యువ నాయకులు ఎర్రబెల్లి రాజేష్, సత్యపాల్, ఫిట్టర్ కన్నం రవి, శంకరయ్య, మల్లేష్, టిబిజికెయస్ యువ నాయకులు ఎస్.శ్రీనివాస్, సంజీవ్, సతీష్ పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూఎస్‌టీ గ్లోబల్ వెల్ఫేర్ ఫౌండేషన్ సంస్థ సౌజన్యంతో శుక్రవారం కళాశాలలో రూ.9లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంస్థ ప్రతినిధులు, కళాశాల అధ్యపకులతో కలిసి భూమిపూజ చేశారు. అదేవిధంగా సైన్స్ విద్యార్థులకు రూ.42 వేల విలువ గల ప్రాక్టికల్ మెటీరియల్‌ని కళాశాల ప్రిన్సిపాల్ అందజేశారు. విద్యార్థిని, విద్యార్థులకు చదువుతో పాటు అన్నీ వసతులను కల్పించినట్లైతే అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని సంస్థ డెలివరీ మేనేజర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని వారికి సరియైన వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్ది దేశ ప్రగతిని పెంచాలని కోరారు. కార్యక్రమంలో టీమ్ డైరెక్టర్ కృష్ణ, సతీష్, డ్రీమ్ సొసైటీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-రెబ్బెన

మండలకేంద్రంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నెలవారి మరమ్మత్తుల కారణంగా ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీపీ రోజారమణి శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన కూసన శ్రీకాంత్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కోసం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు దరఖాస్తు చేసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ నుండి రూ.56 వేలు మంజూరు అయ్యాయి. దీంతో బాధిత కుటుంబానికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోకె వెంకన్న, పురుషోత్తం పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన



నవతెలంగాణ - కాసిపేట

మండల రెవెన్యూ, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్వరీ మినిస్ట్రీస్ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం బెల్లంపల్లి, సోమగూడెం రహదారి మధ్యలోని కల్వరీ మినిస్ట్రీస్ చర్చ్ ప్రాంగణం హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆర్డీవో శ్యామలాదేవితో కలిసి ప్రారంభించారు. రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 151 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి ధ్రువ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధి గ్రస్తులు, దీర్ఘ కాలిక రోగాలతో బాధపడే వారు, గర్భిణులకు రక్తం అవసరాన్ని గుర్తించి రక్త నిల్వలు తక్కువగా ఉండడంతో ఈ శిబిరాన్ని నిర్వహించడానికి కృషి చేసిన తహసీల్దార్, రెవెన్యూ శాఖ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, కల్వరీ ఫౌండేషన్ చైర్మన్ సిస్టర్ షారోన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సర్పంచులు సపాట్ శంకర్, అజ్మీర తిరుపతి, వేముల కృష్ణ, ఆర్ఐ సులోచన, రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యులు, సిబ్బంది, కల్వరీ నిర్వాహకులు శ్రీనివాస్, రవి కుమార్ పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - వాంకిడి

తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన మహిళలకు కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను శుక్రవారం ఎంపీపీ విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టి అండగా ఉంటుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టని కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ పథకం తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుకారాం, తహసీల్దార్ రెహిమొద్దీన్, సింగిల్‌విండో చైర్మన్ జాబిరె పెంటు, బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

అణగారిన జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలంగాణ దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 11 మార్చి 2023

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు, ఇన్‌చార్జికి సన్మానం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులుగా అబ్దుల్ అజీజ్, ఇన్‌చార్జిగా గాండ్ల సమ్మయ్య నూతనంగా ఎన్నికకాగా వారిని శుక్రవారం జమా మజీద్ కమిటీ, సదర్ షఫీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మాట్లాడుతూ ముస్లింల ఎదురుచూస్తున్న షాదీఖానా, ఖబరస్థాన్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ దృష్టికి తీసుకెళ్లి ముస్లిం యువతీ యువకులకు స్వయం ఉపాధి పథకాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఎండి యాకుబ్ అలీ, సుదర్శన్‌గౌడ్, ఏఐటీయూసీ నాయకులు అక్బర్ అలీ, మందమర్రి ఏరియా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అబ్బాస్, బిలాల్ మజీద్ సదర్ నూరుల్, ఆరీఫ్, ఖాజా షరీఫ్, డాక్టర్ సలీం పాల్గొన్నారు.



నేషనల్ స్కాలర్‌షిప్‌కు ముత్యంపల్లి విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని బిందు ప్రియ జాతీయ స్థాయిలో జరిగిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని అభినందించారు. హెచ్ఎం రాథోడ్ రమేష్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థికి సంవత్సరానికి రూ.12వేల చొప్పున ఇంటర్మీడియట్ వరకు స్కాలర్‌షిప్ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, జ్యోతి, మాధవిలత, అర్చన పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలేను స్ఫూర్తిగా తీసుకోవాలి

నవతెలంగాణ-కెరమెరి

సావిత్రిబాయి పూలేను స్ఫూర్తిగా తీసుకోవాలని మాలీ సంఘం మండల అధ్యక్షుడు కావుడే తులసీరాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మాలీ సంఘ భవనంలో సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సావిత్రిబాయి పూలే భారతదేశపు మొదటి మహిళ ఉపాధ్యాయురాలని, గొప్ప సామాజిక సంఘసంస్కర్తని పేర్కొన్నారు. మహిళల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఘనత ఆమెదేనని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే విద్యావంతులైనప్పుడే సాధ్యమని అన్నారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. చదువు నేర్చుకోవడం వల్ల సంస్కారంతో పాటు మహిళల్లో చైతన్య ఏర్పడుతుందన్నారు. బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారని ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సెండే నారాయణ్, వడాయి దేవేందర్, వడాయి సుధాకర్, వడాయి సుభాష్, మేహర్లే దేవేందర్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్నర్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు దేశంలోని మహిళలు చదువుకుంటున్నారంటే దానికి పూర్తి కారణం సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. నిమ్న వర్గాలు బహుజన బిడ్డల చదువుల కోసం కృషి చేసిన గొప్ప సంస్కర్త, మొట్టమొదట మహిళా ఉపాధ్యాయురాలు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్, రైతు జిల్లా అధ్యక్షులు వైరగడే మారుతి పటేల్, ప్రముఖ సామాజిక కార్యకర్త బాపుగౌడ్, బీసీ యువజన సంఘం జిల్లా నాయకుడు గడ్డల ప్రణయ్, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు సిరికొండ సాయి కృష్ణ, జిల్లా నాయకులు గడ్డల కరణ్ పాల్గొన్నారు.

కౌటాల : మహిళా విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే ఆదర్శంగా నిలిచిందని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంత్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రీబాయి 126వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. బ్రిటీష్ పరిపాలన కాలంలో అంటరానితనం ఉన్న రోజుల్లో మహిళలకు విద్య నేర్పడానికి పాఠశాలలను స్థాపించారని తెలిపారు. మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో సమాన హక్కులు పొందేలా చీకటి నుండి వెలుగులోకి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో మాలీ సంఘం మండలాధ్యక్షుడు నికోడె గంగారాం, మండల ప్రధాన కార్యదర్శి మోర్లె రాము, మండల కోశాధికారి చందు, పాండురంగ్, తిరుపతి, కళాశాల అధ్యాపకులు రాము, రాందాస్, రవీందర్, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

తలమడుగు : సావిత్రిబాయి పూలే జీవితం యావత్ మహిళా లోకానికి ఆదర్శమని రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం అధ్యక్షురాలు శోభతాయి తుల్జాపురే అన్నారు. సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం ఖోడద్ గ్రామ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సావిత్రి పూలే దేశంలో మొదటి సరస్వతి తల్లి అని అన్నారు. ఎన్నో ఆటంకాలు ఎదుర్కొని పేదవారికి చదువు చెప్పిన తల్లిగా ఆమె సేవలను కొనియాడారు. విద్యార్థులు చదువుల తల్లివమ్మా సావిత్రిబాయి పూలే అంటూ పాటపై చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, హిందీ ఉపాధ్యాయులు పెట్కులే సుకుమార్, అంతర్జాతీయ క్రికెట్ వ్యాఖ్యాత రవి, పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు వెంకన్న, లక్ష్మి, పీఈటీ మమత, క్రాఫ్ట్ అండ్ డ్రాయింగ్ టీచర్ సత్తెమ్మ, కిరణ్‌కుమార్, మహిళా సంఘం సభ్యులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కెరమెరిలో...

కాసిపేట : సోమగూడెం వాకర్స్ ఆధ్వర్యంలో శిశిమందిర్ క్రీడా మైదానంలో శుక్రవారం సావిత్రి బాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందే మనుస్మృతి, మనువాదంపై తిరగబడ్డారని తెలిపారు. పోరాడి ఆడపిల్లలకు చదువు నేర్పి మహిళలు కూడా మనుషులేనని చాటి చెప్పారని తెలిపారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళలను గౌరవించని పాలకులపై పోరాటం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు బోగే రామకృష్ణ, మహేందర్, కుమార్, శ్రీనివాస్, భానేష్, పోశం, భూమయ్య, తారాచంద్, రమేష్ పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌లో...


కౌటలలో...


తలమడుగు


కాసిపేటలో...

విశ్వబ్రాహ్మణ సంఘ భవనానికి భూమి పూజ



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ సమీపంలో రూ.5 లక్షలతో నిర్మించే విశ్వబ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి జడ్పిటిసి చిన్నరామయ్య శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ఫసి, రైతుబంధు సమితి నాయకులు కొండ్ర రమేష్, గోపిడి గంగారెడ్డి, విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సతీష్, సభ్యులు మహేందర్, సదానందం, రవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నార్నూర్

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నెలవారి మరమ్మతు పనుల కారణంగా రెండో శనివారం మధ్యాహ్నం 12 నుండి 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



నవతెలంగాణ -లోకేశ్వరం

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యామ్‌సుందర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత భోజన్న, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, తహసీల్దార్ సరిత, పిఎసిఎస్ చైర్మన్ రత్నకర్‌రావు, సర్పంచులు నర్సింగ్‌రావ్, నర్సయ్య, ఎంపీటీసీ రాణి అనిల్, బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షులు బండి ప్రశాంత్ పాల్గొన్నారు.

మాయమాటలు చెప్పడంలో బీఆర్ఎస్ దేశానికే ఆదర్శం



- బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అబద్ధపు మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుకోవటంలో బీఆర్ఎస్ దేశానికే ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ ఎద్దేవా చేశారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు కేవలం ప్రజలను మోసం చేసేందుకు, మభ్యపెట్టేవిగా ఉన్నాయని అన్నారు. సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.3 లక్షలు ఇస్తామంటున్నారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాతనే ఈ పథకాన్ని అమలు చేసిందని అన్నారు. ఆ పథకానికి కేసీఆర్ బొమ్మ పెట్టుకొని మేమే చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. ఇంత కాలం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ఆశ చూపి ఇప్పుడు కొత్త పాటను అందుకున్నారని అన్నారు. హుజురాబాద్ ఎన్నికలకు ముందు దళితబంధువని దళితులను, మునుగోడు ఎన్నికలకు ముందు గొల్లకుర్మలకు గొర్రెల కొనుగోలుకు నగదు బదిలీ అని మోసం చేశారని అన్నారు. ఎన్నికలు అయిన వెంటనే అన్ని మర్చిపోయారని అన్నారు. అప్పుడెప్పుడో ఎన్నికలకు ముందు గొర్రెలు పంపిణీ చేశారని అన్నారు. అది మొదటి విడత అన్నారు. రెండవ విడత గొర్రెలకు నలభై వేల రూపాయలకు పైగా పేద యాదవుల దగ్గర నుండి డిపాజిట్ తీసుకున్నారని, కానీ వారికి ఇప్పటి వరకు ఎలాంటి లబ్ది చేకూర్చలేదని తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకులు లాలా మున్న, దినేష్ మటోలియ, కృష్ణ యాదవ్, రత్నాకర్‌రెడ్డి, బోయ విజయ్, రఘుపతి, దారట్ల జీవన్, విఠల్, రవి, కృష్ణ, కార్యకర్తలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని మల్లాపూర్, లక్ష్మణచాంద సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తు పనులు, లైన్ మార్గంలో ఎపుగా పెరిగిన చెట్లు తొలగింపు పనులు జరుగుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రెండో విడత కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఈఓ నాందేవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో 145 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు వారం రోజుల్లో 1456 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అందులో 143 మందికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మరో 96 మందికి కావాల్సిన కళ్లద్దాలను ఆర్డర్ చేశామన్నారు. కంటి వెలుగు వైద్య శిబిరంలో 18 ఏళ్ల పైబడిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

కార్మికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

పదవ వేజ్ బోర్డు పరిధిలో జూన్ 2016 ఒకటవ తేదీ అమలు తర్వాత రిటైర్డ్, అన్‌ఫిట్, మరణించిన(ఎన్సిడబ్ల్యు) ఉద్యోగులు సీపీఆర్ఎంఎస్ స్కీమ్‌లో డబ్బులు రికవరీ అయినవారు, బ్యాలెన్స్ డబ్బులు చెల్లించాల్సిన వారు అనివార్య కారణాలవల్ల దరఖాస్తు చేసుకోని వారికి చివరి అవకాశంగా 31 మార్చి 2023లోగా దరఖాస్తు చేసుకోవాలని డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడువు తేదీలోగా దరఖాస్తు చేసుకోవడానికి సంబంధిత గనులు, డిపార్ట్‌మెంట్‌లో సంక్షేమ అధికారిని లేదా ఆఫీసు సిబ్బందిని కలవాలని తెలిపారు.

SHOW CAUSE NOTICE TO THE RESPONDENTS
IN THE COURT OF THE HONOURABLE MACT - CUM- IADDL.DISTRICT JUDGE AT MANCHERIAL
M.V.O.P.NO.10/2023

Between:
Gandikota Posamma ....Petitioner
and
Chintakindi Balaji and others ...Respondent

To,
1. Chintakindi Balaji @ Balu, S/o. Rajesham, Age : 23 years, Occ: Private Employee and Rider of the motor cycle No.AP IS143, R/o. LIC Colony, Mancherial Town & District.
2. Gandikota Venkataswamy, S/o. Raje sham, Age : 30years, Occ: Tractor driver and owner of motor cycle No. AP 1S 143, R/o. LIC Colony, Mancherial Town & Dist.

Whereas the above named petitioner has filed original petition filed for compensation for the Rs.15,00,000/- and the said case posted to 16-03-2023 for your appearance and answer.

Therefore you are hereby directed to appear in this court in person or by a pleader duly instructed and able answer all material questions relating to the original petition or who shall be accompanied by some person able to answer all such question on 16-03-2023 at 10.30 AM to answer the claim of the petitioner and you are hereby directed to produce on that day all the documents upon which you intended to relay in support of your defense.

Take notice that, in default of appearance on the day before mentioned the case will be heard and determined in your absence. Given under my hand the seal of the court

This day 16th day February, 2023 at Mancherial.

//BY THE ORDER OF THE COURT//

G. RAJESH GOUD
Advocate,
Mancherial
Cell : 9849754755

IN THE COURT OF THE PRINICIPAL JUNIOR CIVIL JUDGE AT ADILABAD
O.S. NO. 57 OF 2020

Between:
Bank of Baroda, Branch Adilabad, represented by it's Branch Manager ...**Plaintiff**
A N D
Sri Mesram Kiran and another ...**Defendants**

To:

Sri. Mesram Kiran S/o. Prahlad, R/o. H.No. 3-3-471/1, Mahalaxmiwada, Adilabad - 504001.
... **Defendant No.1**

Take notice that the Plaintiff Bank has filed the above case for the recovery of loan amount against the Defendants 1 and 2 and the same is posted on 24-03-2023 for your appearance. Hence you are hereby directed to appear in person or through an Advocate on the above said date at 10.30 A.M., in the Hon'ble Court, failing which the matter will be heard in your absence.

// By order of the Court //
Adilabad
Dated: 16-02-2023

(C.MRUTHYUNJAYA)
B.Com., LL.B.,
Counsel for Plaintiff,
Brahmanwada, Adilabad.
Cell No. 9848375236

యువత సమస్యలపై పోరాడేది డీవైఎఫ్ఐ

నవతెలంగాణ-కోటపల్లి

యువత సమస్యలపై ముందుండి పోరాడేది డివైఎఫ్ఐ అని జిల్లా కమిటీ సభ్యులు ప్రేమ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో డివైఎఫ్ఐ నూతన కమిటీని 15 మందితో సంఘం జిల్లా కార్యదర్శి అరిగెల మహేష్, జిల్లా కమిటీ సభ్యులు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం వ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలపై డివైఎఫ్ఐ ముందుండి పోరాటం చేస్తుందని అన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యా, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, హక్కుల కోసం పోరాడుతుందన్నారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. యువత కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను అర్థం చేసుకొని పోరాటాలు చేయాలని పేర్కొన్నారు. మండల అధ్యక్షులుగా పవన్ కళ్యాణ్, ఉపాధ్యక్షులుగా అనిల్, శ్రావణ్, రాజేష్, కార్యదర్శిగా రాజశేఖర్, సహాయ కార్యదర్శులుగా లక్ష్మణ్, స్వామి, సంతోష్, కమిటీ సభ్యులుగా మహేష్, స్వామి, ప్రణయ్, సంపత్, జీవన్, సంతోష్, మల్లేష్ ఎన్నికయ్యారు.



ఘనంగా కళాశాల వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి, కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి అభ్యసించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదువుకోవాలని అన్నారు. విద్య ఉంటేనే నవ సమాజ ఉన్నతి సాధించవచ్చునని అన్నారు. అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అనుభావాలను పంచుకున్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భీమేష్, అశోక్‌రెడ్డి, ప్రదీప్ కుమార్, శ్రీనివాస్, సుభాష్, జ్ఞానేశ్వర్, వనజా, ప్రతిమ, విద్యార్థులు జోర్రిగా రమేష్, సాయి కిరణ్, దీపక్, అవీజ్ పాల్గొన్నారు.





ఎలుగుబంటి దాడిలో తీవ్ర గాయాలు

నవతెలంగాణ - సిర్పూర్(టి)

మండలంలోని లోనవెల్లి, టోంకిని గ్రామాలకు చెందిన చౌదరి బోను, రామగోని అవనిందర్‌గౌడ్‌పై శుక్రవారం ఉదయం ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం..అవనిందర్‌గౌడ్ ఉదయం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో వాకింగ్ చేస్తుండగా ఎదురుగా వచ్చిన ఎలుగుబంటి ఆయనపై కుడికాలు తొడ భాగంలో దాడి చేసింది. ఎదురుతిరగడంతో అక్కడి నుండి పారిపోయింది. పాదాచారులు కుటుంబీకులకు సమాచారం అందించగా సిర్పూర్ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పారిపోయిన ఎలుగుబంటి టోంకిని గ్రామ శివారు ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన చౌదరి బోను చేనులో పనులు నిర్వహిస్తుండగా ఎడమ భుజంపై దాడి చేసింది. బోను అప్రమత్తమై చెట్టుపైకి ఎక్కడంతో ఎలుగుబంటి అక్కడి నుండి వెళ్లిపోయింది. సమీపంలో ఉన్న రైతులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించగా హుటాహుటిన సిర్పూర్ సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సిర్పూర్ రేంజ్ అటవీ శాఖ అధికారి పూర్ణచందర్ ఆస్పత్రికి చేరుకొని గాయాలపాలైన ఇద్దరిని పరామర్శించి దాడి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇరువురు కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వానికి నివేదిక పంపించి ఆర్థిక సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఘటన జరిగిన ప్రదేశాలకు ఎవరూ వెళ్లకూడదని, అత్యవసరమైతే ఇద్దరు ముగ్గురు కలిసి వెళ్లాలని సూచించారు. తీవ్రంగా గాయపడిన చౌదరి బోనును వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించినట్టు కుటుంబీకులు తెలిపారు.

